## క్లుప్తంగా

### ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో పాల్గొన్న గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్: గ్రామాల్లో పేదలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడుతాయని నక్కలపల్లి తాజా మాజీ సర్పంచ్ స్వప్నఅంజయ్యగౌడ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నక్కలపల్లిలో చేవెళ్లలోని లలిత ప్రైవేట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పలు రకాల వైద్య పరీక్షలు చేసి.. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు జగదీశ్వర్‌రెడ్డి, బోజిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు అంజయ్యగౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఓపెన్ ఇంటర్ దరఖాస్తుల గడువు పెంపు

కొత్తూరు: ఓపెన్ ఇంటర్, 10వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే వారికి ప్రభుత్వం ఈ నెల 31 వరకు గడువు పెంచినట్లు ఎంఈఓ అంగూర్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ ఇంటర్ ద్వారా ఒకే ఏడాదిలో రెండేళ్ల కోర్సును పూర్తి చేసే అవకాశం ఉందన్నారు. ఇంటర్‌కు దరఖాస్తు చేసుకునేవారు పదో తరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. ఓపెన్ టెన్త్‌కు దరఖాస్తు చేసేవారు 14 ఏళ్లు నిండి చదవడం, రాయడం రావాలన్నారు. అనివార్య కారణాలతో చదువు మధ్యలో మానేసినవారు, చదువుపై ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### ఆర్థికసాయం అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న గ్రామస్తులు

కేశంపేట: మండల కేంద్రానికి చెందిన బింగి పెంటమ్మ ఆదివారం మృతి చెందింది. మృతురాలిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల, గ్రామానికి చెందిన గుండ్రాతి రమణయ్యగౌడ్ రూ.5వేల చొప్పున బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు గుండ్రాతి పాండుగౌడ్, ఎద్మ హరికిషన్‌రెడ్డి, పోలేపోగు మురళీమోహన్, శ్రీధర్, యాదయ్య, అంజనేయులు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

### బీసీ సంఘం మండల కమిటీ ఎన్నిక



ఆర్. కృష్ణయ్య చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న వెంకటేశ్

శంకర్‌పల్లి: బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా మన్నె వెంకటేశ్ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షుడు బండి వెంకటయ్య సమక్షంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నాడు. అదేవిధంగా ఉపాధ్యక్షుడిగా వడ్ల నర్సింహాచారి, ప్రధాన కార్యదర్శిగా మంగలి సంపత్‌కుమార్‌లను నియమించారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. బీసీ సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేయాలని, ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

# సాగు యంత్రాలకు సబ్సిడీ ఏదీ!

- రైతులకు రాయితీపై అందని పరికరాలు
- ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్న అన్నదాతలు
- వేల రూపాయలు వెచ్చించి అప్పులపాలు
- పునరుద్ధరించాలని వేడుకోలు



నక్కలపల్లిలో పత్తి పంటలో యంత్రంతో కలుపుతీస్తున్న రైతు

మొయినాబాద్‌రూరల్: రైతులు ఎన్నో ఆశలతో వానాకాలం పంటలు సాగు చేయడంపై దృష్టి సారించారు. ప్రస్తుతం మండలంలో రైతులు పొలం బాటపట్టారు. అయితే రైతులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లభించడం లేదు. ప్రత్యామ్నాయ లాభసాటి పంటలు వేయాలని సూచనలు చేయడమే తప్పా సబ్సిడీపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు అందించే పథకాలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. దాదాపుగా ఎనిమిదేళ్లుగా సబ్సిడీ వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ నిలిపివేయడంతో రైతులకు భారంగా మారుతోంది. వ్యవసాయం పనుల్లో యంత్రాల పాత్ర రోజురోజుకు పెరుగుతూనే ఉంది. సీజన్ ప్రారంభం మొదలు రైతులు పంట చేళ్లలో ట్రాక్టర్ల ద్వారా దుక్కులు దున్నడం, చదును చేయడం, యంత్రాల ద్వారానే విత్తనాలు వేయడం వంటి అనేక పనులను నిర్వహిస్తున్నారు. యంత్రాలతో తక్కువ ఖర్చు, తక్కువ సమయం పడుతుండడంతో ఎక్కువ మోజు చూపుతున్నారు. ప్రస్తుతం పత్తి పంటలో కలుపు నివారణకు ఒక్క రోజు కూలీకి 700–800 వరకు ఉంది. కానీ ఒక ఎకరా పంట పొలంలో రెండు గంటల్లో డీజిల్ యంత్రంతో కలుపు తీసే పని పూర్తవుతుంది. ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై యంత్రాలు అందిస్తే ఎంతో మేలు జరుగుతుందని పలువురు రైతులు కోరుతున్నారు.

**భారంగా కొనుగోళ్లు**

వ్యవసాయంలో యంత్రాలను వినియోగించడంతో రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గడంతో పాటు సమయం కూడా చాలా ఆదా అవుతుంది. కూలీల ద్వారా వారం రోజుల్లో జరిగే పని యంత్రాలతో ఒక్కరోజులో పూర్తవుతుంది. ప్రస్తుతం మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో 10 ఏళ్ల క్రితంతో పోలిస్తే యంత్రాల వినియోగం బాగా పెరిగింది. చిన్న, సన్నకారు రైతులు సైతం అప్పులు తెచ్చి యంత్రాలు, పరికరాలను సమకూర్చుకుంటున్నారు. గతంలో రోటోవేటర్ ధర రూ.80 వేలు ఉండగా.. ప్రస్తుతం రూ.లక్షకు పైగా ఉంది. కల్టివేటర్ కలుపు తీసే యంత్రం గతంలో రూ.25 వేలు ఉండగా.. ప్రస్తుతం 40 వేలకు పెరిగింది. ఈ విధంగా యంత్రాల ధరలు రోజురోజుకు పెరుగుతుండడంతో రైతులకు వ్యవసాయ యంత్రాలు వినియోగం భారంగా మారింది. ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తే బాగుంటుందని కోరుతున్నారు.

**అన్నదాతల ఎదురుచూపులు**

వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్రాలు, పరికరాలను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అందజేసింది. ఈ పథకం నిలిచిపోవడంతో తిరిగి ఎప్పుడు అమలవుతుందోనని అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. వ్యవసాయ పరికరాలపై ఎస్సీ, ఎస్టీలకు 95 శాతం, మిగిలిన వర్గాలకు 50 శాతం రాయితీ ఇచ్చేవారు. ట్రాక్టర్లతో పాటు పొలం దున్నడానికి ఉపయోగపడే కల్టివేటర్, రొటోవేటర్, పవర్ టిల్లర్, వరి నాటు యంత్రాలు, పవర్ వీడర్, పురుగుల మందు పిచికారీ యంత్రాలు, ఇతర వ్యవసాయ అనుబంధ పరికరాలను రాయితీపై అందించేవారు. ప్రస్తుతం ఈ పథకం అమలులో లేకపోవడంతో రైతులు మొత్తం ధర చెల్లించి కొనాలంటే ఇబ్బంది పడుతున్నారు. దీంతో రైతులకు పెట్టుబడి భారంగా మారింది. ఒక్కో వ్యవసాయ పరికరాన్ని బయట కొనుగోలు చేయాలంటే రైతులకు పెద్ద మొత్తంలో ఖర్చు అవుతుంది. ఈ పథకం ప్రస్తుతం అమలు కాకపోవడంతో రైతులపై భారం పడుతోంది.

**“సబ్సిడీ అందించాలి**



ప్రస్తుతం రైతులు పండిస్తున్న పత్తి, కంది, మొక్కజొన్న వంటి పంటలకు కలుపుతీసే సమయం ఆసన్నమైంది. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు గతంలో పనిముట్లను సబ్సిడీపై అందజేసేవారు. కలుపు తీయడంలో రైతులకు యంత్రాలతో తక్కువ సమయం, తక్కువ ఖర్చు అవుతుంది. కూలీలు దొరకడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు సబ్సిడీ యంత్రాలను అందించాలి.

– పాండు, రైతు, నక్కలపల్లి

**ధరలు ఎక్కువగా ఉన్నాయి**



ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో కూలీలను, సమయాన్ని మిలిగించుకోవడానికి యంత్రీకరణ తప్పనిసరి. అలాంటి ముఖ్యమైన యంత్ర పరికరాలను ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తే ఎంతో మేలు జరుగుతుంది. మార్కెట్‌లో ఆయా పరికరాలకు ధరలు మండిపోతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు మేలు చేసే విధంగా సబ్సిడీ ద్వారా యంత్ర పరికరాలను అందించాలి.

– తిరుపతిరెడ్డి, బాకారం

**ఆదేశాలు రాగానే అందిస్తాం**

ప్రభుత్వం ద్వారా యంత్రాలు వచ్చే అవకాశం ఉంది. మండలంలోని చాలా మంది రైతులు వ్యవసాయ సాగులో ఉపయోగించే యంత్రాలను రాయితీపై అందించాలని కోరుతున్నారు. అధికారుల నుంచి ఆదేశాలు రాగానే రైతులకు అందిస్తాం.

– అనురాధ, ఏఓ

### బ్రైటర్‌మైండ్ శిక్షణకు విశేష స్పందన



చిన్నారులకు శిక్షణ ఇస్తున్న హార్ట్‌ఫుల్‌నెస్ శిక్షకులు

కొత్తూరు: పట్టణంలోని గ్రంథాలయంలో ఆదివారం శ్రీరామచంద్రమిషన్ కన్హశాంతివనం, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ నిర్వాహకులు చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన బ్రైటర్‌మైండ్ శిక్షణకు విశేష స్పందన లభించింది. ఇందులో భాగంగా ఇప్పటికే బ్రైటర్‌మైండ్‌లో శిక్షణ పొందిన పలువురు చిన్నారులు కళ్లకు గంతలు కట్టుకొని పలు వస్తువులు, వాటి రంగులను చెప్పడం ఆశ్చర్యానికి గురిచేసింది. అంతేకాకుండా ఇతరులు కాగితంపై గీసిన పలు చిత్రాలను వీరు కళ్లకు గంతలతోనే గుర్తించి కొద్దిగా తేడా లేకుండా తిరిగి వాటిని గీశారు. ఈ సందర్భంగా శిక్షకులు మాట్లాడుతూ.. స్పర్శ, శబ్దం, వాసనతో మెదడు మూడో నేత్రంగా పనిచేస్తోందన్నారు. చిన్న వయస్సు నుంచే బ్రైటర్‌మైండ్‌ను సాధన చేయడంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నట్లు తెలిపారు. పట్టణంలోని గ్రంథాలయంలో ప్రతి ఆదివారం ఉదయం 10 గంటలకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకు ముందు పెద్దలకు ధ్యాన ప్రక్రియ సాధనపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సభ్యుడు అమర్, శిక్షకులు, చిన్నారులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ హయాంలో బీసీలకు అన్యాయం

జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు విశాల

కేశంపేట: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని, 33 శాతం ఉన్న రిజర్వేషన్లను 23కు తగ్గించిందని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొత్తపేటలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలు గుండె రాణి అధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ తగ్గించిన బీసీ రిజర్వేషన్లను కాంగ్రెస్ పార్టీ 23 నుంచి 42 శాతానికి పెంచిదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు బీసీ రిజర్వేషన్లను పెంచితే జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత తన మూలంగానే రిజర్వేషన్లను ప్రభుత్వం పెంచిదనడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించినట్లే, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని మళ్లీ ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నిత్యం ప్రజల సంక్షేమం కోసం కష్టపడుతున్నారన్నారు. ఎమ్మెల్సీ కవిత ఇంట గెలిచి బయట గెలిచేందుకు కష్టపడాలన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ పదేళ్లు అధికారంలో ఉంటే మొదటి నాలుగేళ్ల వరకు జాగృతి పనిచేసిందని, తర్వాత ఎందుకు కనుమరుగు అయిందో ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రజలకు తెలపాలన్నారు. అనంతరం రాణి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో అనసూయ, అరుణ, సుజాత, కళమ్మ, అస్మా, లలిత, సువర్ణ, లక్ష్మీ, మణేమ్మ, నర్సమ్మ, చెన్నమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశాల

## సీఎంను విమర్శించడం తగదు

మహిళా కాంగ్రెస్ నేతల ధ్వజం



మాట్లాడుతున్న మహిళా కాంగ్రెస్ నేతలు

షాద్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్సీ కవిత విమర్శించడం తగదని పట్టణ మహిళా కాంగ్రెస్ నేతలు నాగమణి, వజ్రమ్మ, చంద్రకళ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మహిళల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపడుతోందన్నారు. మహిళలకు 500లకే సిలిండర్, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, పెట్రోల్ బంకుల నిర్వహణ, ఇందిరమ్మ ఇళ్లు , ఉచిత బస్సు వంటి పథకాలను చేపట్టారన్నారు. ఈ పథకాలన్నీ ఎమ్మెల్సీ కవితకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మద్యం దందా చేసి మహిళా లోకం తలదించుకునేలా చేసిందని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్ మహిళల కోసం ఎలాంటి పథకాలు చేపట్టారో కవిత ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో కాంగ్రెస్ సర్కార్ కులగణన చేపట్టి రిజర్వేషన్లు తీసుకొస్తే అది తానే సాధించానని చెప్పుకోవడం సరికాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి కవితకు లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

### వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి



ఫిట్‌నెస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్: ప్రతి రోజు విధిగా వ్యాయామం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మహబూబ్‌నగర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఓ ఫిట్‌నెస్ కేంద్రాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజు వ్యాయామం చేయడం ద్వారా శారీర దృఢత్వంతో పాటు మానసికోల్లాసం పెంపొందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ జీవన విధానంలో మార్పులు చేసుకోవాలని, వ్యాయామం జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు కొంకళ్ల చెన్నయ్య, రాజేందర్‌రెడ్డి, అప్పి, సాయికృష్ణ, శేఖర్‌గౌడ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మండల అధ్యక్షుడు గూడ వీరేశ్



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

కేశంపేట: కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటేనేరాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొనాయపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో ఇళ్లు, నూతన రేషన్‌కార్డుల మంజూరు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హులైన ప్రతీ ఒక్కరికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంలో ఇళ్లు అందిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల్లో అర్హుల ఎంపికలో ఎలాంటి వివక్షత లేకుండా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిబంధన మేరకు లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అందించే సంక్షేమ పథకాలతో సబ్బండ వర్గాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కార్యక్రమంలో కర్రెడ్ల నర్సింహారెడ్డి, గ్యార సురేష్, సోప్పరి జంగయ్య, రాజశేఖర్, శ్రీనివాస్, జంగయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌ఎంను విధుల నుంచి తొలగించాలి

పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్



విద్యార్థిని పరామర్శిస్తున్న రాజేశ్

షాబాద్: విద్యార్థిపై బూటు కాలుతో తన్ని, చితకబాదిన హెచ్‌ఎంను విధుల నుంచి తొలగించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో విద్యార్థి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షాబాద్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎంను విధుల నుంచి తొలగించాలన్నారు. 6వ తరగతి చదువుతున్న విద్యార్థిని రాకేశ్‌ను తరగతి గదిలో బంధించి బూటు కాలుతో తన్నడం సరికాదన్నారు. గతంలో హెచ్‌ఎంపై అనేక ఫిర్యాదులు ఉన్నాయని, ఎస్‌ఎంసీ నిధులను కూడా ఆయన పక్కదోవ పట్టిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థిపై దాడి చేసిన విషయమై డీఈఓకు ఫోన్ చేసిన లిఫ్ట్ చేయడంలేదన్నారు. ఆతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఎంపీటీసీ స్థానాలు ఖరారు

- మున్సిపాలిటీ ఏర్పాటుతో తగ్గిన సంఖ్య
- మండలంలో పది స్థానాలకే ఎన్నికలు
- తుది జాబితా విడుదల చేసిన అధికారులు



మండల ప్రజాపరిషత్ కార్యాలయం

చేవెళ్ల: మండల ప్రజా పరిషత్‌లోని ఎంపీటీసీ స్థానాల సంఖ్య మండలంలో తగ్గింది. గతంలో ఉన్న 17 స్థానాల నుంచి 10కి కుదించారు. ఇటీవలే అధికారులు ఈ ఎంపీటీసీ స్థానాలపై కసరత్తు చేసి 12వ తేదీన తుది జాబితాను సైతం విడుదల చేశారు. మండలంలో ఇక 10 ఎంపీటీసీ స్థానాలకే ఎన్నికలు జరగనున్నాయి.

**మున్సిపాలిటీ ఏర్పాటుతో..**

మండలంలోని 12 గ్రామాలతో కలిసి చేవెళ్ల మున్సిపాలిటీగా ఏర్పడగా.. అందులో కలిసిన గ్రామాలను ఎంపీటీసీ పరిధిలో నుంచి తొలగించారు. దీంతో మండలంలో మిగిలిన 25 గ్రామాలతో ఆయా గ్రామాల పరిధిలో ఉన్న జనాభా, ఓటరు జాబితా ప్రకారం ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేశారు. మండలంలో (2011 లెక్కల ప్రకారం) మొత్తం జనాభా 35,453 కాగా.. ఇందులో పురుషులు 18,157, మహిళలు 17,296 మంది ఉన్నారు. గతంలో మండలంలో ఉన్న ఎంపీటీసీ స్థానాలను అలాగే ఉంచి మున్సిపాలిటీ పరిధిలోకి వెళ్లిన ఎంపీటీసీ స్థానాల పరిధిలో మిగిలిపోయిన గ్రామాలతో కలిపి ఎంపీటీసీ స్థానాలను ఖారారు చేశారు. ఇలా 17 ఎంపీటీసీ స్థానాల నుంచి 10కి మారాయి. మండలంలో ఈ పది స్థానాల్లో 9 ఎంపీటీసీ స్థానాలు పాత పేర్లతో ఉండగా.. గ్రామాలను అటు ఇటుగా సర్దుబాటు చేసి కొత్తగా న్యాలట పేరుతో కొత్త స్థానం ఏర్పడింది.

**మండలంలో ఏర్పడిన ఎంపీటీసీ స్థానాలు ఇవే**

| ఎంపీటీసీ స్థానం | పరిధిలోని గ్రామాలు | జనాభా |
|---|---|---|
| 1. తంగడపల్లి | తంగడపల్లి | 2,555 |
| 2. అంతారం | అంతారం | 4,528 |
| 3. న్యాలట | న్యాలట, సింగప్పగూడ, తల్లారం | 2,513 |
| 4. ఎన్కేపల్లి | ఎన్కేపల్లి, ఈర్లపల్లి, కమ్మెట, గొల్లగూడ | 4,288 |
| 5. ముడిమ్యాల | ముడిమ్యాల,రావులపల్లి, కుమ్మెర, గొల్లపల్లి | 4,304 |
| 6. ఆలూరు-2 | ఆలూరు-2 | 2,993 |
| 7. ఆలూరు -1 | ఆలూరు -1 | 2,807 |
| 8. చనువెల్లి | చనువెల్లి, బస్తేపూర్, మిర్జాగూడ, | 3,616 |
| 9. ఖానాపూర్ | ఖానాపూర్, నాంచేరు,రేగడిఘనాపూర్,దేవరంపల్లి | 4,332 |
| 10. గుండాల | గుండాల, అల్లవాడ | 3,517 |

**“తుది జాబితా ప్రకటించాం**



మండలంలో గతంలో ఉన్న 17 ఎంపీటీసీ స్థానాలకు గాను ఇప్పుడు 10 స్థానాలు ఏర్పాటయ్యాయి. నిబంధనల ప్రకారం మండలంలోని మొత్తం జనాభాను తీసుకొని ఆయా ఎంపీటీసీ పరిధిలోకి వచ్చే గ్రామాల భౌగోళిక స్వరూపాన్ని పరిశీలించి ఏర్పాటు చేశాం. అన్ని అభ్యంతరాలకు అవకాశం కల్పించారు. ఎలాంటి అభ్యంతరాలు లేకపోవటంతో తుది జాబితాను ప్రకటించాం. ఇక మండలంలో ఈ 10 ఎంపీటీసీ స్థానాలతోనే మండల పరిషత్ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలకు అన్ని సిద్ధం చేస్తున్నాం.

– హిమబిందు, ఎంపీడీఓ, చేవెళ్ల

# అంబరాన్నంటిన బోనాల సంబురాలు



షాద్‌నగర్: బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు



చేవెళ్ల: టీచర్స్ కాలనీలో..

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో ఆదివారం ఆషాఢమాస బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. భక్తిశ్రద్ధలతో ప్రజలు బోనాలు తయారుచేసి డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా అమ్మవారి ఆలయాలకు చేరుకొని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచే ఆలయాలకు భక్తులు తరలిరావడంతో కిక్కిరిసిపోయాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా ఉత్సవాల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పోలీసుల బందోబస్తు చేపట్టారు. కార్యక్రమాల్లో వివిధ పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



కొత్తూరు: బోనాల ఊరేగింపులో నాయకులు



చేవెళ్ల: బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు